


"నమస్తే" అన్నారు నలుగురూ ముక్త కంఠంతో.

"నమస్తే. రండి, కూర్చోండి" అన్నాడు సారథి చదువుతూన్న పత్రికని టీపాయ్‌మీద పడేసి కుర్చీలోంచి లేస్తూ. ఎదురుగా వున్న మూడు కుర్చీల్లో సర్దుకున్నారు ఆ ముగ్గురమ్మాయిలు. నాలుగో అమ్మాయి మాత్రం ఇబ్బందిగా దిక్కులు చూస్తూ నిలబడింది.

"సారీ. మూడు కుర్చీలే వున్నాయ్ కదూ. మీ రిందులో కూర్చోండి" అని తన కుర్చీని ముందుకి లాగి ఆ ముగ్గురమ్మాయిలకి దగ్గరగా జరిపాడు సారథి. అయినా ఆ నాలుగో అమ్మాయి సిగ్గుతో సంకోచిస్తూనే నిలబడింది.

"ఫరవాలేదు- కూర్చోండి. నేను మరోటి తెచ్చుకుంటాను" అని పక్కగదిలోంచి గోద్రెజ్ ఫోల్డింగ్‌ఛేర్ తెచ్చి వాళ్ళ కెదురుగా కూర్చున్నాడు సారథి.

"చెప్పండి" అన్నాడు చిన్నగా నవ్వి.

"తిన్నగా ఆఫీసునించే వస్తున్నారా?" అడిగాడు. ఆఫీసునుంచే వస్తున్నారని వాళ్ళ హేండుబాగులూ, వాటిలోంచి తొంగిచూసే టిఫిన్ బాక్సులూ చెబుతూనే వున్నాయి. ఎంత రచయిత అయినా అతనూ సగటు మనిషే కాబట్టి సంభాషణ ప్రారంభించడానికి అంతకంటే మంచి ప్రస్తావన దొరకలేదు ఆ సందర్భంలో.

"మేం నలుగురం అకౌంట్సు డిపార్టుమెంటులో పనిచేస్తున్నామండీ. చూసే వుంటారు. మిమ్మల్ని కలుసుకుని కాసేపు మాట్లాడిపోదామని వచ్చాము. నా పేరు సుమతి" అని పక్కనున్న తన స్నేహితురాలికేసి చూసింది మొదటి అమ్మాయి.

"నా పేరు పావని. మీ కథలంటే నాకు చాలా ఇష్టం" అంది రెండో అమ్మాయి ధైర్యంగా. "నా పేరు

రోహిణి. అసలు 'శశాంక' పేరుతో కథలు రాసేది మీరేనని పోయిన వారం 'వెలుగు' పత్రిక చూసేదాకా తెలీదు మాకు. అందులో మీ 'ప్రేమజల్లు' నవల పూర్తయింది. మీ ఫోటో కూడా వేశారు. అప్పుడు తెలిసింది అసలు సంగతి" గడ గడా చెప్పేసింది మూడో అమ్మాయి.

నాలుగో అమ్మాయి వంతు వచ్చింది. ఆమెకేసి చూశాడు సారథి. ఆమె పర ధ్యానంగా ఎటో చూస్తోంది. ఆమె తొడ గిల్లి "మాట్లాడవే మొద్దూ" అని సన్నగా గొణిగింది రోహిణి. ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చినట్టుగా ఏమిటన్నట్టు రోహిణికేసి చూసింది, ఆ నాలుగో అమ్మాయి కళ్ళు టపటపలాడిస్తూ.

"సారీ సార్. మీరు మరేమీ అనుకోకండి. దానిపేరు లోచని. కాని మేమంతా 'ఆలోచనీ' అనే పిలుస్తాం. ఎప్పుడూ ఏదో లోకంలో వున్నట్టుంటుంది. దానిక్కూడా మీ రచనలంటే ప్రాణం. అయినా మాతోబాటు ఇక్కడికి రావటానికి ఒక పట్టాన ఒప్పుకోలేదు. బలవంతంగా లాక్కొచ్చామనుకోండి. కొత్త వాళ్ళతో మాట్లాడాలంటే తగని సిగ్గు, బిడియం!" అని, ఒక్కక్షణం ఆగి "ఇప్పుడు మీ ఆరోగ్యం ఎలా వుందండీ?" అని అడిగింది మొదటి అమ్మాయి సుమతి.

"ఇప్పుడు ఫరవాలేదు. రెండుమూడు రోజుల్లో జాయినవా లనుకుంటున్నాను" అన్నాడు సారథి.


"ఈ ఆఫీసుకి ట్రాన్స్‌ఫరై రావటానికి ముందు మన మద్రాసు హెడాఫీసులో చాలాకాలం పనిచేశారా అండీ" అడిగింది రోహిణి.

"అయిదు సంవత్సరాలున్నాను మద్రాసులో."

"అప్పట్లో మద్రాసు నగర వాతావరణాన్ని ప్రధానంగా తీసుకుని వరుసగా కొన్ని కథలు వ్రాశారు మీరు. నేనెప్పుడూ వెళ్ళకపోయినా మద్రాసులోని ముఖ్యమైన ప్రాంతాలన్నీ తిరిగి చూసినట్టే అనిపిస్తుంది మీ కథలు చదవటం వల్ల. ముఖ్యంగా మెరీనా సముద్రతీరం, పాండీబజారు, అడయారు, మైలాపూరు టాంకు, వడపళని స్టూడియోలు, పారిస్ కార్నరు- ఇప్పుడు మద్రాసు వెళితే ఎవరినీ అడగక్కర్లేకుండా నగరమంతా తిరిగిరాగలననే ధైర్యం వుంది. బస్సు రూటు నెంబర్లతో సహా తెలుసు. అంత విశదంగా చిత్రించారు మీ రచనల్లో."

"ఒంటరిగా మాత్రం వెళ్ళకండి. మెళ్ళోగొలుసులు లాక్కునేవాళ్ళెక్కువయ్యారు ఈ మధ్య మద్రాసులో" అన్నాడు సారథి. అంతా గొల్లున నవ్వారు నాలుగో అమ్మాయి తప్ప.

"సారథిగారూ! మీ 'ప్రేమజల్లు' గురించి ఒక చిన్న సందేహం, అడగొచ్చా?" అంది సుమతి కొంచెం సంకోచం నటిస్తూ.




"నిరభ్యంతరంగా" అన్నాడు సారథి.

సుమతి కుర్చీలో సర్దుకుని చెప్పడం ప్రారంభించింది.

"ఈ మధ్య తెలుగులో వస్తున్న ప్రేమ కథలు చాలా చదివామండీ." 'ట్రూ లవ్ నెవెర్ రన్స్ స్మూత్' అనీ, ప్రేమ యాత్రలో పూలతోటలకు బదులు ముళ్ళ బాటలే ఎక్కువగా వుంటాయనీ, ప్రేమించిన వాళ్ళెవరూ సుఖపడలేదనీ, ప్రేమికుల మధ్య అపార్థాలూ, అపోహలూ ఎదు

రవుతుంటాయనీ, పెళ్ళితో ప్రేమకి ఫుల్‌స్టాపు పడుతుందనీ — ఇలా రకరకాలుగా వ్యాఖ్యానిస్తూ ప్రేమించడమంటే కోరి కోరి చిక్కుల్లో ఇరుక్కోవటమే అనే అభిప్రాయాన్ని కలిగిస్తూ వున్నారు రచయితలు. కాని మీ 'ప్రేమజల్లు' నవల ఇందుకు భిన్నంగా వుంది. యువతీయువకుల మధ్యన చిగురించి పెనవేసుకునే ఆ అనుభూతిని అంత మధురంగా, ఉన్నతంగా, మనోహరంగా వెన్నెలజల్లు కురిసినట్టుగా మీవలె చిత్రించినవారు చాలా అరుదు. నవల చదివిన తరువాత మాకు ఏమనిపించిందంటే మేమంతా కూడా ఎందుకు ప్రేమించి పెళ్ళిచేసుకోలేదా అనిపించింది. ప్రేమలో పడకపోవటం వల్ల జీవితంలో మే మెంత కోల్పోయామో, ఎన్ని మధురానుభూతులకు దూరమయ్యామోనని అనిపించింది. సార్, మీరు ఏమీ అనుకోనంటే సూటిగా ఒక మాటడగాలని వుంది. చెపుతారా?" అని ఆగింది సుమతి.

"చెపుతాను. కాని ఒక్క నిముషం ఆగండి. ఇప్పుడే వస్తాను" ఆ గదిలోంచి లేచివెళ్ళాడు సారధి.

"అతన్ని మేం ఇన్ని ప్రశ్న లడుగుతూంటే నువ్వు మాత్రం అలా బెల్లం కొట్టిన రాయిలా కూర్చుంటావేమిటే. కనీసం సభ్యతకోసమైనా అతనితో ఒక మాట మాట్లాడితే నీ నోటిముత్యాలు రాలిపోతాయా? అత నేమనుకుంటాడో అనయినా లేదు నీకు" అని సాధించడం మొదలుపెట్టారు ఆ ముగ్గురమ్మాయిలూ నాలుగో అమ్మాయిని. ఆ అమ్మాయి ఏదో అనేలోగా ట్రేలో కాఫీ కప్పుల్తో లోపలికి ప్రవేశించాడు సారధి.

"ముందు కాఫీ తీసుకోండి ప్లీజ్" అని ట్రేని టీపాయ్‌మీద పెట్టాడు."

ముగ్గురమ్మాయిలూ తలో కప్పు అందుకుని సిప్‌చేస్తున్నారు.

"తీసుకోండి" అన్నాడు సా ర ధి నాలుగో అమ్మాయికేసి చూసి చిన్నగా నవ్వి.

"తీసుకోవే. అది కూడా మేమే అందివ్వాలా ఏమిటి" అంది పావని నాలుగో అమ్మాయిని చురచుర చూస్తూ.

అంతా కాఫీలు తాగటం పూర్తయింది.

"అడగండి" అన్నాడు సారధి సుమతికేసి తిరిగి.

"అదే, మీ ప్రేమజల్లు నవల గురించి ప్రేమభావాలని, ఆ అనుభూతిని మీరంత చక్కగా, సహజంగా చిత్రించగలిగారంటే అందులో కొంతైనా నిజజీవితంలో మీకు అనుభవమై వుండాలి. ముఖ్యంగా మీ కథలోని 'సాగరి' పాత్రనే తీసుకోండి. అటువంటి అమ్మాయిలకు తప్పకుండా తటస్తపడి వుంటుంది. మీ రామెని ప్రేమించి ఉంటారు మీరు చిత్రించిన ఆ మధురమైన సన్నివేశాలని మీ రామెతో పంచుకుని వుంటారు. లేకపోతే ఆ సంభాషణలు అంత చక్కగా,

అత్యంత సహజంగా కుదిరివుండేవికావు. ఏమంటారు?" అని సూటిగా అతని ముఖం లోకి చూసింది సుమతి.

కొద్దిక్షణాలు మౌనంగా వున్న తరువాత చెప్పసాగేడు సారధి. అంతా చెవులు రిక్కించి ముందుకి వంగి వింటున్నారు.

"మీ వూహ నిజమే. 'సాగరి'లాంటి అమ్మాయి నాకు తటస్తపడింది యూనివర్సిటీలో చదువుకునే రోజుల్లో. ఆమెని ప్రేమించాను. ఎవరూ, ఎవర్నీ, ఎన్నడూ ప్రేమించనంత గాఢంగా, పిచ్చిగా ప్రేమించాను. ప్రేమభావాన్నే తిరస్కరించినవాణ్ణి, ప్రేమకీ, వాంఛకీ తేడా లేదని వాదించేవాణ్ణి ఆమెను పిచ్చిగా అరాధించాను. ఆమెకోసం ఏమి చెయ్యడానికైనా సిద్ధపడ్డాను. కాని....కాని...."

అంతా రెప్పవాల్చకుండా కుతూహలంతో అతనికేసి చూస్తున్నారు.

"ఏమైంది సార్. ఆమెకి ఏమైంది" అడిగింది రోహిణి.

"కంగారుపడకండి. ఆమె కేమీ కాలేదు" వాళ్ళలో కుతూహలం మరింత అధికమైంది. నిశ్శబ్దంగా అతనికేసి చూస్తున్నారు.

"ఆమె కడగంటి చూపుకూడా లభ్యం కాలేదు నాకు. కనీసం ఒక్క చిరునవ్వు, ఒక్క మాట ఒక్క పలకరింపుని కూడా పొందలేకపోయాను" అతని కంఠంలో ఎక్కడో సన్నని జీర ధ్వనించింది.

అంతా అదిరిపడ్డట్టయినారు. నమ్మలేనట్టుగా చూస్తున్నారు అతనికేసి.

"అయితే మరి...." అని ఆగిపోయింది పావని.

మీ రింతసేపూ నా నవలలో పొగిడిన ఆ సన్నివేశాలు, సంభాషణలు అంతా నా వూహాజనితాలు మాత్రమే. ఏ రోజు కారోజు ఆమెని గురించి నేను కన్న కలలు, కల్పించుకున్న సన్నివేశాలు, అందంగా అల్లుకున్న సంభాషణలు - అంతే. ఈ కలలే లేకుంటే నే నేమైపోయి వుండేవాడినో తల్చుకుంటే...."

"మీరు చెప్పేదంతా నిజమేనా అండీ?" ఇంకా సందేహం తీరక అడిగింది పావని.

"ఎవరండీ ఆ హృదయంలేని ప్రియురాలు?" అడిగింది రోహిణి అక్కసుతో.

పెదాలమీదికి నవ్వు తెచ్చుకున్నాడు సారధి. ఒకసారి వాళ్ళకేసి చూశాడు. వాళ్ళంతా తనకేసే చూస్తున్నారు,

"ఇప్పటిదాకా మీతోనే వుంది" అని నాలుగో కుర్చీకేసి తిరిగాడు.

నివ్వెరపోయి అంతా అటుకేసి తిరిగారు. ఎప్పుడు లేచి వెళ్ళిపోయిందో ఆ నాలుగో అమ్మాయి కుర్చీ ఖాళీగావుంది.